క్లుప్తంగా

కుష్టు వ్యాధిపై అవగాహన పెంచుకోండి



కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

బల్లికురవ: శరీరంపై స్పర్శలేని రాగిరంగు మచ్చలు, చేతులు, పాదాలు, నొప్పిలేకుండా పుండ్లు, కండరాల బలహీనత లక్షణాలుంటే మందులతో అదుపులోకి తేవచ్చని గుంటుపల్లి వైద్యాధికారి రమీజ్ అహ్మద్ తెలిపారు. గురువారం బల్లికురవ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కుష్టు వ్యాధి రహిత సమాజ స్థాపనకు చేయి చేయి కలపాలన్నారు. మార్టూరు ఎంపీడీవో శ్రీనివాసరావు పాఠశాల హెచ్ఎం బి. భారతి, ఉపాధ్యాయులు , ఆరోగ్యశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



సచివాలయాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

అద్దంకి రూరల్: సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలని అద్దంకి తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి అన్నారు. గురువారం చక్రాయపాలెం సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామంలోని హెల్త్‌ను, ఫ్యామిలీ ఫిజీషియన్ షాపును పరిశీలించారు.

తేనె మంచు పురుగు నివారణతో దిగుబడులు

మార్టూరు: మామిడిలో నవంబరు నుంచి మార్చి నెల మధ్య కనిపించే తేనె మంచు పురుగును సకాలంలో గుర్తించి నివారించగలిగితే అధిక దిగుబడులు సాధించవచ్చని మార్టూరు ఉద్యానవన శాఖాధికారి బి. హనుమంతనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురుగులు తేనె వంటి జిగురు పదార్థాన్ని విసర్జించి నల్లని మసి తెగులును ఉధృతి పరుస్తుందని తెలిపారు.

బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి

సంతమాగులూరు (అద్దంకి): బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండే విధంగా చూడాలని మండల ప్రత్యేక అధికారి రాజేశ్ అన్నారు. గురువారం మిన్నెకల్లులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులను అడిగి భోజనం, కూరలు ఎలా ఉన్నాయనే వివరాలు తెలుసుకున్నారు. రాజేశ్ మాట్లాడుతూ డ్రాప్ అవుట్ అయిన విద్యార్థులను మరలా బడిలే చేరే విధంగా చూడాలని మహిళా పోలీసును ఆదేశించారు.

ప్రాధాన్యతా క్రమంలో పనులు



వార్డు సభ్యులతో మాట్లాడుతున్న కృష్ణ చైతన్య

అద్దంకి: రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య బుధవారం పట్టణంలోని రెండో వార్డులో నాలుగో రోజు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని మునిసిపల్ చైర్మన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ, నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. వార్డులో సమస్యలను తెలుసుకుంటూ, యువకులు, వృద్ధులను పలుకరించి వారి క్షేమ సమాచారాలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఆయా గృహాల వారికి పథకాల ద్వారా అందిన లబ్ధి పత్రాలను అందజేశారు. చైతన్య మాట్లాడుతూ జగనన్న చెప్పిన విధంగా కులమత పార్టీ వర్గ రహితంగా పనులు చేయిస్తానని చెప్పారు. గతంలో ప్రతిపక్ష పార్టీ నాయకులున్నచోట పనులు చేసిన దాఖలాలే లేవని, తాను అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో చేయిస్తున్నానని గుర్తు చేశారు. వైస్ చైర్మన్‌లు దేశు పద్మేశ్, కె. అనంతలక్ష్మి, పట్టణ పార్టీ నాయకుడు కాకాని రాధాకృష్ణమూర్తి, సందిరెడ్డి రమేశ్, రోశయ్య, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ బాజీ వలి, ఔట్ సోర్సింగ్ డైరెక్టర్ ఎన్. భువనేశ్వరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అమరవీరుల జీవిత గాథలపై అవగాహన



అన్నంభొట్లవారిపాలెంలో అవగాహన కల్పిస్తున్న రిటైర్డు ప్రిన్సిపాల్ వెంకటనారాయణ

పర్చూరు: స్వాతంత్ర్య పోరాట విశేషాలకు సంబంధించి అమరవీరుల జీవితగాథలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రిటైర్డు ప్రిన్సిపాల్ టి.వెంకటనారాయణ అన్నారు. గురువారం భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా అన్నంభొట్లవారిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట వారి ఆధ్వర్యంలో అల్లూరి జయహో ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. రిటైర్డు ప్రిన్సిపాల్ వెంకటనారాయణ బ్రిటీష్ వారు భారతీయులపై కొనసాగించిన దమనకాండను వివరించారు. అనంతరం దేశభక్తికి సంబంధించిన ప్రశ్నలను విద్యార్థులను అడిగి సమాధానాలు చెప్పిన వారికి బహుమతులు అందించారు. హెచ్ఎం దేవేంద్రరావు, రిటైర్డు ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐసీయూలో ఉన్న వ్యక్తికి పెన్షన్



పెన్షన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్

చినగంజాం: ఐసీయూలో చికిత్స పొందుతున్న వ్యక్తికి వైఎస్సార్ పెన్షన్ అందజేశాడు గ్రామ వలంటీర్. కడవకుదురు సచివాలయం 2 పరిధిలో మానికల మధుబాబు అనే వ్యక్తి కొన్ని రోజులుగా గుంటూరు న్యూరో సర్జికల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ మహేష్ బాబు గురువారం పెన్షన్ అందజేసి ప్రశంసలు పొందాడు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



స్టాకు వివరాలను తెలుసుకుంటున్న ఎంపీడీఓ రమణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

జె. పంగులూరు: జగనన్న లే అవుట్లలో పట్టాలు పొంది ఇల్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణం చేపట్టాలని ఎంపీడీఓ రమణమూర్తి అన్నారు. ఆయన గురువారం మండలంలోని కొండమంజులూరు గ్రామ జగనన్న లే అవుట్‌ను సందర్శించారు. సొంత ఇంటి కలను సాకారం చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఇంటి నిర్మాణం ఆస్తికి యజమాని అవుతారని చెప్పారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రైతు భరోసా కేంద్రం, చెత్త నుంచి సందప కేంద్రం, ఇ– క్రాప్ రిపోర్టును, సచివాలయ ఉద్యోగుల రికార్డులను పరిశీలించి తగు సూచనలు సలహాలు చేశారు. సెక్రటరీ శ్రీనివాసరావు, వీఆర్వో, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ నిర్మాణాలు పూర్తి చేయించాలి

చినగంజాం: జగనన్న కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను వెంటనే మొదలు పెట్టి పూర్తి చేయించాలని ఎంపీడీఓ డి. విజయలక్ష్మి సూచించారు. గురువారం వైఎస్సార్ కేపీ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంతవరకు మొదలు పెట్టని గృహాల లబ్ధిదారులను కలిసి నిర్మాణం చేయక పోవడానికి కారణాలను తెలుసుకొని వారికి స్వయం సహాయక గ్రూపుల ద్వారా రూ. 35 వేలు నగదు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కోఆర్డినేటర్ అంబేద్కర్, గృహనిర్మాణ శాఖ డీఈఈ మురళి, ఈఓఆర్డీ స్వరూపరాణి, ఏపీఎం అంజిబాబు, హౌసింగ్ ఏఈ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి



యర్రంవారిపాలెంలో చెత్త సంపద కేంద్రం పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ

యర్రంవారిపాలెం (కారంచేడు): గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి కేవీ రామారావు అన్నారు. గురువారం యర్రంవారిపాలెంలోని అనేక ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలను పరిశీలించిన ఆయన 10వ తరగతి విద్యార్థుల ప్రతిభ పరిశీలించారు. పాఠశాలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎంపీడీఓ రమేష్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



పర్చూరులో సహాయం చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పర్చూరు: స్థానిక చెంచుల కాలనీలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు, సపోర్టు గంగ అధ్యక్షులు గడ్డిపాటి శ్రీనివాసరావు, క్లబ్ సభ్యుల సహకారంతో బాధిత కుటుంబానికి ఇంటి సామగ్రి, సరుకులు, కూరగాయలు, బట్టలు, నగదును గురువారం అందజేశారు. వైస్ ఎంపీపీ కోట ప్రసన్నా శ్రీనివాసరావు, రోటరీ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, రోటరీ సభ్యులు కోట హరిప్రసాద్, భవనం రాజగోపాలరెడ్డి, కోట శ్రీనివాసరావు, కొల్లా సుబ్బారావు పాల్గొన్నారు.

కారంచేడు ఎంపీడీఓగా రమేష్ బాబు

కారంచేడు: ఎంపీడీఓగా ఆర్. రమేష్‌బాబు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఈయన ఇక్కడే పనిచేశారు. వ్యక్తిగత కారణాలతో సెలవులో ఉన్న ఆయన మరలా బాధ్యతలు తీసుకున్నారు. రమేష్‌బాబు సెలవులో ఉన్న సమయంలో చినగంజాం ఎంపీడీఓ విజయలక్ష్మి పని చేశారు.

మాజీ ఎమ్మెల్యే విగ్రహావిష్కరణ నేడు

మేదరమెట్ల: అద్దంకి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జాగర్లమూడి రాఘవరావు నాలుగో వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పమిడిపాడు గ్రామంలో నిర్వహించనున్నారు. ఈమేరకు నిర్వాహక కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. చీరాల శాసన సభ్యుడు కరణం బలరామకృష్ణమూర్తి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీఇన్‌చార్జికరణంవెంకటేశ్‌హాజరవుతారు.

దాతల కృషి అభినందనీయం



సభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఆమంచి

ఇంకొల్లు (చినగంజాం): దాతలు తానికొండ వీరయ్య, విజయభారతి దంపతులు తమ గ్రామంలో అభివృద్ధిద్ది పనులకు నిధులు కేటాయించడం అభినందించాల్సిన విషయం అని పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. గురువారం ఇంకొల్లు అంబేద్కర్ నగర్‌లో దాతలు తానికొండ వీరయ్య, విజయలక్ష్మి దంపతులు వారి కుమారుడు గంగాధర్ జ్ఞాపకార్థం తమ సొంత నిధులు రూ. 2 లక్షలతో ఏర్పాటు చేసిన అంబేద్కర్ నగర్ శ్మశాన వాటికలో గ్రావెల్ రోడ్డు, వీధిలైట్లు ప్రారంభించారు. ఎంపీపీ బండారు అనూష రాజ్‌కుమార్, సర్పంచ్ యేజర్ల ప్రసన్న సైమన్ బాబు, వైస్ ఎంపీపీ తూమాటి చలమయ్య, మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, ఉప సర్పంచ్ లతీఫ్, బండ్ల వెంకట సుబ్బారావు, పల్లెపోగు ప్రసాద్, నలతోటి సునీల్ బాబు, చిన్నిపూర్ణారావు, పాటిబండ్ల గోపాల స్వామి పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సాధారణం



రాజేష్ మాస్టారుని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దగ్గుబాడు (కారంచేడు): ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు బదిలీలు సర్వ సాధారణమని యూటీఎఫ్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ భవనం శ్రీనివాసరెడ్డి అన్నారు. దగ్గుబాడు ఉర్దూ పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన చాగంటి రాజేష్‌కు అభినందన సభ గురువారం నిర్వహించారు. రాజేష్ ఇక్కడ పనిచేసినంత కాలంలో ఉర్దూ పాఠశాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేశారన్నారు. సీహెచ్ మహాలక్ష్మమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అత్యవసరం

చినగంజాం: పిల్లలకు పౌష్టికాహారం అందించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ డి. విజయలక్ష్మి హెచ్చరించారు. గురువారం సంతరావూరు సచివాలయ పరిధిలో ఆమె పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం సచివాలయ పరిధిలో సిబ్బంది అందిస్తున్న సేవలను, ప్రభుత్వ భవనాల నిర్మాణాల ప్రగతిని, గృహాల నిర్మాణాలను, సచివాలయ పనితీరును పరిశీలించారు. పాఠశాలల సిబ్బంది, హౌసింగ్ ఏఈ రాజశేఖర్, ఏఈపీఆర్ దాసు, మహిళా పోలీస్ శివపార్వతి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రోగాలు దూరం

బల్లికురవ: జగనన్న గోరుముద్దలో ప్రతిరోజూ అందిస్తున్న పౌష్టికాహారాన్ని తినాలని 104 వైద్యాధికారి నాగేశ్వరరావు కోరారు. ఉప్పుమాగులూరు ఉన్నత పాఠశాలలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనీమియా ముక్త భారత్ కింద అందిస్తున్న మాత్రలతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. హెచ్‌యం ఏడుకొండలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది విష్ణు డేవిడ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శాంతి భద్రతలు పరిరక్షిస్తా..

మార్టూరు: సర్కిల్‌లోని మార్టూరు, పర్చూరు, యద్దనపూడి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో శాంతి భద్రతలపై ప్రత్యేక శ్రద్ధ వహించనున్నట్లు సీఐ ఎస్‌కే టి. ఫిరోజ్ అన్నారు. మార్టూరు సీఐగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గురువారం రాత్రి తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. స్థానిక జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడతామన్నారు. ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్‌గా వ్యవహరిస్తామని ప్రజలు, మీడియా కూడా తమకు సహకరిస్తే మెరుగైన సేవలు అందించటానికి అవకాశం ఉంటుందన్నారు. ఎస్ఐ కమలాకర్, ఏఎస్ఐలు పాల్గొన్నారు.

మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న కరణం వెంకటేష్

చీరాల: మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ అందె కస్తూరి బాయి మంగళవారం మరణించగా గురువారం ఆమె పార్థివదేహానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, బీసీ కమిషన్ మెంబర్ అవ్వారు ముసలయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఫలాలు

చీరాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. గురువారం ఏఆర్‌నగర్ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సమస్యలను అడిగి తెలుసుకుని తగు పరిష్కారం చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, మున్సిపల్ కమిషనర్ ఐసయ్య, కో–ఆప్షన్ సభ్యురాలు షేక్ ఫాతిమ, 8వ వార్డు ఇన్‌చార్జి షేక్ మహిమూద్, కో–ఆప్షన్ సభ్యులు షేక్ కబీర్, అమీర్, షేక్ అబ్దుల్ సలాం, బాజీ, సామేలు, ఇలియాజ్, ఆర్‌బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, కౌన్సిలర్లు మల్లెల లలిత, గోలి స్వాతి, మించాల సాంబశివరావు, కె.యానాదిరావు, చీమకుర్తి బాలకృష్ణ పాల్గొన్నారు.



బుక్‌లెట్ అందిస్తున్న కరణం వెంకటేష్

నేడు కూకట్లపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

బల్లికురవ: మండలంలోని కూకట్లపల్లి సచివాలయ పరిధిలోని యానాది సంఘంలో శుక్రవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ మండల పార్టీ కన్వీనర్ చింతలేరయ్య గురువారం తెలిపారు. రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య హాజరవుతారని తెలిపారు.

ఆశా వర్కర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

చినగంజాం: చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పెదగంజాం పంచాయతీలోని పల్లెపాలెం గ్రామంలో ఆశ వర్కర్ పోస్టు ఖాళీగా ఉందని.. దరఖాస్తు చేసుకోవాలని వైద్యాధికారి ఎస్. విజయ భాస్కర్ గురువారం తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి పాసై ఉండాలని, 25 నుంచి 45 ఏళ్ల మధ్య కలిగి స్థానికులై ఉండాలని తెలియజేశారు. ఈ నెల 8 లోగా దరఖాస్తు అందజేయాలని తెలిపారు.

బాధ్యతలు గుర్తించండి

బల్లికురవ: సచివాలయ వ్యవస్థలో పని చేస్తున్న వివిధ శాఖల సిబ్బంది బాధ్యతలు గుర్తెరిగి పని చేయాలని బాపట్ల జిల్లా డీఎల్‌పీవో కె. శ్రీనివాసరావు, డీపీఆర్‌వో టి. మోహన్‌రాజ్, ఎంపీడీవో సీహెచ్‌కృష్ణ కోరారు. గురువారం కొమ్మినేనివారిపాలెం, వైదన కొప్పరపాడు, గుంటుపల్లి సచివాలయాలను తనిఖీ చేశారు. ఈవోఆర్డీ జి. సీతామహాలక్ష్మి, సెక్రటరీలు సీహెచ్ వెంకటసురేష్, కేవీ అనిల్ కుమార్, ఆర్‌ఏ ఖాన్ పాల్గొన్నారు.

పర్చూరు ఎస్సైకు అభినందనలు

పర్చూరు: స్థానిక ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎన్. చెంచుప్రసాద్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవరపల్లి ఉపసర్పంచ్ తోకల కృష్ణమోహన్, నూతలపాడు సర్పంచ్ చిన్నయ్య, ఏదుబాడు సర్పంచ్ ఏసుపాదం, మారేనేని శివయ్య, కట్టా బుజ్జి, జె.అంకిరెడ్డి, నూర్‌బాషా అశోక్ లు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువతో సన్మానించి బోకే అందజేశారు.

చర్చిలో మైక్ సెట్లు చోరీ

బల్లికురవ: మండలంలోని కొప్పరపాలెం గ్రామం నుంచి కోటావారిపాలెం వెళ్లే రోడ్‌లో చర్చిలో సుమారు రూ. 80 వేలు విలువ చేసే మైక్ సెట్‌లు, యాంప్లిఫైర్‌లు బుధవారం అర్ధరాత్రి చోరీకి గురయ్యాయి. గురువారం చర్చికి వెళ్లిన పాస్టర్, గ్రామస్తులు చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నారు. అలాగే బస్‌స్టాప్‌లో టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనం కూడా చోరీకి గురైయింది.